# పేరంటం

శ్రీమతి జానకీపురుషోత్తముగారు

బాలామణి శ్రావణమాసంకోసం యెదురుచూస్తూవుంది. ఆషాఢమాసంనుంచి స్కూళ్లోపాటలు నేర్చుకుంటూ యెప్పుడు శ్రావణమాసపు మంగళవారంవస్తుందా యెప్పుడు గౌరీదేవిని పూజించి పాటలుపాడుదామా అని చూస్తోంది. చూస్తూవుండగానే రోజులు యిట్టేగడచి పోయినై. శ్రావణమాసంవచ్చింది. ఊరికంతా ఒక విధమైన అలంకారంకలిగింది. ఎవరియింటివాకిళ్లు చూసినా మామిడాకులతోరణాలతోనూ; గుమ్మాలు పసుపు, కుంకుమలతోను చూడడానికి ముచ్చటగావున్నాయి. బాలామణి యీపనిపాటల్లో తల్లికి చాలా సరదాగా సహాయంచేస్తూ చెల్లెలిని చూచి—

"చెల్లాయీ! పేరంటాళ్లని పిల్చేందుకు నాతో వస్తావుటే?" అన్నది.

"మనయింట్లో యేమిటి? అక్కాయి! పేరంటాళ్లని పిలవడంయెందుకే?" అన్నది చెల్లాయి.

"రేపు, నేను మంగళగౌరినోము నోచుకుంటానుగదూ! అందుకు" అందిబాల.

"ఆ నోము యెందుకే? అక్కయ్యా!"

"ఆ నోము నోచుకుంటే పెనిమిటికి ఆయుర్దాయం, ఆరోగ్యంకలుగుతుంది. అందుచేత ఆడపిల్లలంతా నోచుకోవాలి."

"ఎన్నాళ్లు నోచుకోవాలే? అక్కాయి!"

"అయిదేళ్లు."

"అబ్బో. అయితే నేనుకూడా నోచుకోనా? అక్కాయి"

"ఇప్పుడుకాదమ్మా. ఇంకారెండేళ్లు పోయి నీకు పెళ్లి అయింతర్వాత."

"అయితే పేరంటాళ్లని పిల్చేందుకెప్పుడు వెళ్లాలే మరి?"

"సాయంత్రం."

"మరి, మనంపేరంటానికి వెళ్లడంయెప్పుడమ్మా మరి."

"రేపు, ఊరికేప్రశ్నలెయ్యబోకు. లోపల అమ్మ పిలుస్తోంది, పద. వెడదాం."

* * *

మంగళవారం తెల్లవారుజామునే బాలామణి నిద్రలేచి దొడ్లోవున్న చెట్ల గన్నేరుపూలు, పారిజాత పుష్పాలు తీసికొచ్చుకుంది. తల్లి చేత తనూ, చెల్లాయి తలంటి నీళ్లు పోసుకున్నారు. తల్లి చెప్పగా గౌరీదేవిని పూజచేసుకుని నైవేద్యంపెట్టిందిబాల. మధ్యాహ్నంనుంచి వచ్చిన ముత్తయిదువులకు ఒకొక్కరికే వాయనాలు యిచ్చుకుంటోంది. వచ్చేముత్తయిదు, వెళ్లేపేరంటాలు. ఒకమూల గ్రామఫోనుపాట, చిన్నపిల్లలు, చిట్టిపిల్లలు శెనగలకోసం ఆరాటం. పసితమ్ముళ్లు వాళ్లకి పారాణి పుయ్యలేదని కూనురాగాలు. "నా శెనగలమూట పూడిపోయిందే. కట్టిపెట్టవు?" అని కొందరు. ఇట్లా ఇల్లంతాహడావిడిగావుంది. మొగవాళ్లకి కూర్చోడానికి, నుంచోడానికి యెక్కడాతావులేదు.

* * *

"నిన్నవాళ్ల రామమ్మ మన్ని పేరంటానికి పిల్చిందికదూ? అక్కడికి వెళ్లొద్దూటే? అక్కయ్యా!" అందిచెల్లాయి.

"వెడదాంవుండు."

"సరస్వతికూడా పిల్చిందికాదుటే?"

"ఆ."

"ఇంకా చాలామంది పిల్చారమ్మా! వాళ్ళందరినీ నాకు తెలీదు. అబ్బ! ఎన్నిళ్లకు పోయిరావాలమ్మా! ఎల్లా వెడతాం? టైమయిపోతోంది. ఇక నేవెడతానమ్మా!"

"అందరియింటికీ వెడదాం. ఉండు. చెల్లాయి! తొందరపెట్టకుమరి."

"ఇంకెప్పుడమ్మా? సాయంకాలంఅవుతూవుంటే."

ఇంతలో "ఇంక మీరు పేరంటానికి వెళ్ళండి అమ్మాయిలు, వచ్చినవారికి నేను వాయనాలు యిస్తాను గాని పోయిరండి త్వరగా." అని పిల్లల్ని యిద్దరిని పేరంటానికి వెళ్లమంది తల్లి. జాగ్రత్తమ్మా చెల్లాయి మెళ్లో వస్తువులు అవివున్నాయి. సెనగలు అవిజాగ్రత్తగా మూటకట్టుకో, త్వరగారావాలె. ఎక్కడైనా పాటపాడమంటే పోటాపోటీతో కూర్చోకండి. చిన్నమ్మాయి యిట్లాతిరగవే. కాటిక అలికేశావు అప్పుడే" అంది వాళ్లమ్మ.

"రావే చెల్లాయి! పోదాం. పరికిణీ కేలవ యీడవకు" అంటూ బుజంమీద చెయ్యేసి "చెల్లాయి! బయల్దేరు." అందిబాల.

"నేను చెరపలేదు. అదే చెరిగిపోయిందే కాటిక" అంటూ చెల్లాయిసాగింది.

* * *

వాకిలి దిగుతూంటే వానతుంపరలు పడ్డాయి. "అబ్బ! చినుకులు పడుతున్నాయే చెల్లాయి!"

"అక్కాయి. వర్షంకురుస్తే వచ్చేటప్పుడు దోవలో పడవలు వేసుకుంటూవద్దామే?"

"ఎప్పుడూ నీళ్లలోతడుద్దామాఅనే-అల్లరి చెయ్యకపద."

ఇంతలో అఖండంగా వర్షంపెద్దదైంది. చెల్లాయి అన్నది అరుగుమీద కూర్చున్న అమ్మమ్మని చూచి, "అమ్మమ్మమ్మా-వర్షంఎందుకు కురుస్తుందే?"

"వర్షమా? మీరంతా ఆడపిల్లలు నోమునోచుకుంటే దేవుడు సంతోషించి కురిపిస్తాడు."

"ఎందుకు?"

"పంటలుపండడానికి."

"ఏపంటలు?"

"అన్నీను."

"సెనగలుకూడానా!"

"పో, పిచ్చిపిల్ల, వర్షంఆగింది. తడవకుండా పోయిరండి."

* * *

తండ్రి ఆఫీసునుంచి రాగానే గబగబా తండ్రిదగ్గరకు వెళ్లి చెల్లాయి "మేమే. పేరంటానికివెళ్లివచ్చాం నాన్నా!" అన్నది.

"ఎవరెవరింటికి వెళ్లేరమ్మా?"

"చాలాయిళ్లకు వెళ్లేం."

"అక్కడేమిచ్చేరమ్మా! చిట్టీ?"

"సెనగలు వాయనంయిచ్చేరు. తెచ్చుకున్నాం."

"యేంచేసివచ్చిందో అడగండి" అంది వాళ్లమ్మ.

"ఏంచేసింది?"

"నాన్నే అడగండి."

"నువ్వుచెప్పరాదూ?"

"చేసినది చెప్పదుమళ్లీ. యిప్పట్లో అమరుతుందా. అప్పటి—"

"ఏదేనా వస్తువు పారేసిందా యేమిటి?"

"ఆఁ"

"ఏంవస్తువు?"

"మెళ్లో చైను."

"ఎవరెవరు వెళ్లారు పేరంటానికి?"

"పిల్లలిద్దరూ."

"కూడా పెద్దవాళ్లెవరువెళ్లారు?"

"ఎవరూ వెళ్లలేదు."

"ఇంకేం పిల్లల్ని ఒక్కళ్లనిపంపి వాళ్లని కేకలు పెట్టడం యెందుకు? పెద్దవాళ్లకి జ్ఞానంలేక పోయిం తర్వాత" అని పెల్లాయిని యెత్తుకుని వాకిట్లో గాలిపీల్చడానికి వెళ్లేడు వాళ్లనాన్న.

# నోములు

గుండిమెడ శ్రీరామశర్మ గారు బి. ఏ.

వ్రతముజెడినను ఫలములు వనిత! నీకు
దక్కననుచునుజెప్పెడి డంబములను
విశ్వసించుచు జెనటివై విఱ్ఱవీగి
నోముజేసిననేమాను నీమకోఅంత.
పూర్వకాలమునందున బుణ్యస్త్రీలు
భక్తిశ్రద్ధలుమీరగ భర్తకెపుడు
శ్రేయపుసిరినిగూర్పగ జెలగినారు,
వడయగల్గిరినోముల ఫలములెపుడు.
మీరరెవరుగను పతియాజ్ఞమీటకరించి,
యుత్తమాంబలనెల్లర నాడలేదు,
పూనియుండిరిమౌనంబు పుణ్యక్రియల
తామసంబున మౌనంబు దాల్పలేదు.
భర్త యొకెడెన నాకలి బాధయనగ
అడ్డువచ్చినవారల నాడికొనుచు
తనకుమరణము వ్రాయుడే తమ్మిచూలి
యనుచు బిడ్డలబోద్రోచియాగడమున
కాంత లెప్పుడు గుప్పించిగంతులిడుచు
మానసంబున శోకయింతమరపులేక
పూర్వగాథలనన్నియు పుక్కిళించి
ముఖమునందున నుమియుచుముక్తికొరకు
చిత్తశుద్ధినిదెలియక జేయువ్రతము
లిష్టకామార్థసంపద లీయగలవొ?
ముక్తిగూర్పగ మాహాత్మ్యశక్తిగలదొ?
పుణ్యవనితలసాటిని బొందగలవొ?
కలిమిలేములదలచుచు గలతజెంది
కలిగియుండిన వ్యామోహగడలియుండు
మున్గిదేలుచు ముకుళితమూర్తిఁబూని
వ్రతముజేయగబూనిన వరమువినుము.
అర్థకాయపుసంపదల్ వ్యర్థమగును
చూడవత్తురుపరులెల్ల చోద్యమనుచు
గృహమునందున గలహంబుగేళిసల్ప
నాగ్రహింతురుబంధుగు లాగమనుచు.
నీమమనునోకమిషజూపి నిశ్చలంపు
మానసాంబుధి బరమేశు బూనువరకు
వ్రతములనియెడితంత్రములు వరములంద
విప్రవర్యులుగూర్చిన విధముగాదె
వడయదలచితివేని యాపరమపదము
పొందజేయకపోవునే పుణ్యమూర్తి
క్షణముజాలదె మనమున బ్రణయమూర్తి
నిశ్చలంబుగస్తుతిజేయ? నీరజాక్షి!